# నిశ్చితార్థం

అయ్యయ్యో ! ఇదేం పాపం;తల్లి ! ఇనీ కనని, యిచిత్రాలు వ్రాయవట్టె అచ్చం నాట్కం తీర్గనె నడిసె. ఇన్నాళ్లగోలె దాంతు లోలె పేర్సుకున్న ఆశెలన్ని పిడ్కల కుచ్చెన గూలినట్ల గూలిపాయె. ఆశెలుగీశెలు, అట్ల వెట్టు, ఆయింటి పేరుదల్సు కుంటెనె యాదోచెప్పతరంగానిఎత ముంచుకొస్తది. సూ(ద్రాదు;

నిన్నిటిదాంక ముద్దుగ కళ కళలాడుకుంట కండ్ల పండుగోలె కానొచ్చెఇల్లు, ఇయ్యాళ్ల అఖండ దీపాలు ఎల్గుతున్నా సమరు జాలక, కొడిగట్టిన గుడ్డిదీపమోలె, మస్క వట్టి మబ్బుగ కండ్ల వడ్తుండది. ఊకెనే అన్నారు? అంగిసుకమే అంగాల సుకవంట; దుడ్డిచ్చి దుక్కాన్ని కొనుక్కున్నట్ల మావోళ్లు, ఈపిల్ల మాటిని, బెల్లం బువ్వ మిస్కితె దక్కదంట, ఆదిక్కుమాలిన సవందం జేతమంట సేయి జాపిరి. అదేమొ? కొర్వితోటి నెత్తిగోక్కున్న కాడికొచ్చె.యామాట కామాటేగని సవందాని కేమైంది ? నూట్లకు కోట్లకో పిలగాడు, గని వాళ్ల గుణాలెలొచ్చు, లొచ్చో ? ఎచ్చో ? తిప్పలు వడేది మనం '' అంట వోకాడనిల్వకుండ కాలు గాలిన పిల్లి తీర్గ ఆడికీడ్కి ఆసువోసుకుంట తామ సం తోటి తనండ్ల తానే మాట్లాడుకుంట తిర్గవట్టింది యశోదమ్మ.

శనాసేపటినుండి సెల్లెలి వాల్కం గనిపెడ్తున్న అక్క, గోయిందమ్మ యింగ వుండ వట్టలేక సెల్నెల్ని జూసుకుంట 'అదేందే ? యశోద ! వొచ్చిరానిబాపనయ్య మంత్రం జదివినట్ల నీయంతల నీవే మాట్లాడుకుంటుండవ్ ? ఏందో కత ? అంట అడ్డం దగిలి జవాబు కోసం జూసింది.

ఆ మాటల్యావి బట్టిచ్చుకోకుండ యశోదమ్మ ఇంగింత ఊపుతోటి అయ్యో ! 'నాజూకు బీబినారోటికాయి' అంట ఆతల్లికి నాగరీకమంట, కుటీలపు గుణాలు , కువ్వారపు నడ్తలు ! పిడుగసొంటి వాళ్ల మాటలిని, అంబ్యాదరాలు పాపం జానకమ్మ భూమి బట్టి కంటికి పుట్టె డేడుస్తుండది. అంతెత్తు అన్నయ్య గోపాలన్న మొకాన కత్తేటుకు నెత్తుటి సుక్కలేదంటె నమ్ము, ఇంగ చిత్రం ఏందంటె, పిల్లది మట్టుకు దైర్నంగనె

దిర్గుతుండది. మరిదాని గుండె దిటువేందో ? అంట కోపాన, యానోయి లేకుండ మాట్లాడ్క పోతున్న యశోదమ్మను నిలవెట్టి అక్క గోయిందమ్మ:

'అదేందే ? ఎచ్చులు ! ఏందో ? గాలివూనినట్ల వూగుడేనా ? ఇంతమింగుడు వడనంత ఇసం ఏంబుట్టె ? యామర్మం దెల్వక నేను మిడ్కిసస్తుండ, ఇంతగానం అడ్గు తుంటె నీవుసెవు మీద పేనువారనట్ల పల్కక, వుల్కక వుండుడేంది ? అంతకుంపటి వెట్టిందెవరు ? ఏంది కత ? అంట అడ్గింది.

కోటగట్టంత ఎత్తు అన్నయ్య గోపాలన్న పునాదుల్తోటి ఒక్కసారి పెకిలినట్లైండు, ఇంగ సెప్పుకో దగ్గ సిత్రం ఏందంటె, పిల్లదిమట్టుకు యాడసెమర్చుకుండరాయోలె గట్టి గుండది; మరిదానిగుండె దిటువుకె మొక్కాలె అంట, అగకుండ సెప్పకపోతుంటె అక్క వుండవట్టలేక..

''యెవ్వారం ఏందో ? ఏకోలె గాదు; కొరుకుడువడని మేకోల్నె తయారై నట్లుండది, లేకుంటె, సెల్లె లింత కసి బిసి వడ్తాది ? అంట గొంతులాజిగ జేసి , నిలువరిచ్చుకుంట....

'ఏందిర ? ఎచ్చెలు ? ఎంత తామసం వున్నగని ఎదుటోళ్ల మాటగుడ ఇనిపిచ్చుకో కుండ గాలిగిలి సోకినట్ల శిగం వూగుడేన ? కొర్కవడనంత కొర్వి ఏంబుట్టె ? ఎట్లవుట్టె ? నిన్నంత గదిలిచ్చి చిట్లిస్తున్న ఎత ఏందొ ? సెప్పు నా బంగారు గద ! అంట బుజ్జగిచ్చింది.

అక్కమాటలిన్న యశోదమ్మ నిప్పుకల మీద నీళ్లు జల్లినట్ల గాంగ, గడె మంచం మీద గూసుండి ''అవునక్క ! నీవన్నట్ల నిన్నటి నుంచి నా మనుసు, కసితోటి, అవుమా నం తోటి, తినస్కారం తోటి కుమ్ములవెట్టిన మాడికాయె తీర్గవుడ్కుతుండది. నీకు దెల్వదు, అక్క ! ఆడివిల్ల పుట్టుక, తరాలు గడ్సినగని, యుగాలు సుట్లు జుట్టినగని మాసి పోని పాతకత, దిన దినం కోడిగండమోలె కొత్త కత, ఎన్క జూస్తె బాయి, ముంగల జూస్తె సెర్వు, ఇక్కడజూస్తె కనిపెంచినోళ్లు, అక్కడ జూస్తె కలిసి కాపిరంజేసె మొగనోళ్లు, నడుంగల పిల్ల నజ్జి గిజ్జి;

అక్క ! సామెతలంటె వూకెవుట్టవు, అనుభవాన్ని రంగరిచ్చుకోని తాగి నంక జీర్ణమైన సారం తోటి పోట్మరిల్లుతయి. అంది కె'కులానికి కులమే సీడపురు గన్నరు'.

అంటె ? మన ఆడి కులాన్ని వోర్వంది ఆడికులమే ! మెన్నటి మనపిల్ల సంగతె సూడ రాదు, ఇన్నాళ్లవట్టి ఒగరు ప్రాణం, ఒగరు శరీరం అంట మొసిల్న సంగతి దెల్సిగుడ ఆ పిల్లగాణి తల్లి యాదొ? వొంక జూపి మొకం దిప్పింది. ఇదేం అన్యాలం ? పిల్లకు కొదువ యాండది ? మనకు ఎల్తి యాండది ? పిల్ల రూపుజూస్తె సాలు ఆకలి దూపలు వాస్తవి.

జమిడి రెప్పల తోటి కవుచిప్పలోలె కాట్కెకండ్లు, అద్దాలోలె ముద్దులు గురిసె చెంపలు, సింగిణీలోలె బొమ్మలు, పల్కులసిల్కోలె మాటలు, పొన్నకాయెతీర్గ పొంకమైన పెయ్యి,మొగమారాజుల తోటి సరి బరి సదువు, అన్ని అమిరిన సదువుల తల్లి అసొంటి కుందనపు బొమ్మను, వొల్లమన్నంత పని జేసిన్రు ఏటవుతలి తెగ నీల్గుళ్లు. ఖదరుదెల్వని గుణాలు, అంట జెప్పుతుంటె జర జర పోవడి పసిగట్టిన గోయిం దమ్మ నడుంగల అడ్డమొచ్చి -

''ఎశోద ! నీవు జెప్పవట్టిన జోలి మన పెదనాయిన మనుమరాలు ప్రభమ్మ ముచ్చెటగిన గాదుగద ? అదిచిల్క తల్లి, సింగారాల దొంతి, దానికి వొంకలు దిద్దెటోండ్లె వరు ? గని'' ఇది మళ్ల యాదన్న కొత్త సంవందం గిట్టన ఏంది?

ఆపిల్ల ఇంతకు ముందె మనపురాణాలల్ల పతివర్తలోలె మెచ్చి మనుసిచ్చినోణ్ణే గాదని హరిబ్రహ్మాదులొచ్చినగని వొల్లనంట గూసున్నట్ల పుకారుండది. వుత్తపుకారు గాదు ఖుద్దు మీ బావనె జెప్పిండు ఇనుకత అంట మొదలు వెట్టింది.

''నేను ఈడ్కిరాక తొలిగ అంటే వో వారం పది దినాల కింద రామపురం నుండి వొ అయ్యగారొచ్చి మీ బావను గల్సి, ఆముచ్చెటీ ముచ్చెట అల్లం బెల్లం మాట్లాడి నంక వుపాయంగ ' ధొరవారూ ! శుభకార్యం మీద బయిలెల్లి శుభ వర్తమానం దెచ్చిన, అన్నిట్ల భేషైన సంబంధం, ఆర్సమైన కుటుంబం, మీ కన్న వోబెత్తెడు పొడుగరి పిల్లవాడు, విలా యత్ సదువు అంటె అమెరికాపలట్, వీండ్లకు కోడలు చదువుకున్న సక్కని చుక్క కావాల్నంట. ఆంత సదువూ సింగారం కలెబోసిన సొగుసుకత్తె దొరసాని వారి బంధు వర్గంల ఉందని తెలిసి, నన్ను అప్పుడు గాదిప్పుడంట తుర్తుల పంపిన్రు. తమరు పట్టిచ్చు కోవాలె ' అన్నడంట. ఆ మాటలిని, అన్ని దెల్సిన మీ బావ భవంతి బంకులు దద్దరిల్లె టట్ల నగుకుంట బంకుల్లకు నన్ను విలిపిచ్చి నా కండ్లల్ల కండ్లు గలిపి !

''ఇగో ! ఇంటుండవా ?వోశుభకార్యంల నీ సాయం గావల్నంట, అంటె

రామాపురంల పేరు వోయిన ఇంటికి మీ ప్రభను అడుగొచ్చిండు అయ్యగారు, ఏవంటవ్ ? నీకు దెల్సొ తెల్వదొ గని, ఆదొర్సాని పెద్దాసిన్న అనకుండ ఎన్కటికి దమయంతమ్మ నలమారాజును వరిచ్చి ఇంద్రాది దేవుతలను గాదన్న కతోల్నె తానుగుడ ప్రసాదు అనెటి జతగాణ్ణే కోరుకున్నదంట; యాపుట్టల యాపాముందదొ ? ఆడోళ్లేం సిన్నసన్నోండ్లు గన్కన ? నీళ్ల లోతు ఆడిదాని ఎదలోతు ఎవ్వరికి దెల్వదన్నరు పెద్దలు. అయితె మాయె; వోత్యాప మీ తల్లిగారి రాజ్యం పయినం గట్టి, మతులబు దెల్సుకోనిరారాదు'' అంట సూటిగ నాకు గురివెట్టిండు.

ఈమాటలిన్న నాకు బయమైంది, సిగ్గైంది, గని, అయ్యగారి ముంగల అలుసు జూపకుండ పెద్దిర్కమంత మొకం నిండ పుల్మకోని అయ్యగార్ని జూసి, 'అయ్యగారు! మీరు దెచ్చిన, సవందం అన్నివిదాల మెప్పితమైందె, గని ఇందాకె మీ రింటిరి గద, దొర జెప్పిన ముచ్చెట. రెక్కలొచ్చిన రుచులు ఈడొచ్చిన పిల్లలు, ఎన్కటి తీర్గ తల్లిదండ్రి మాటిచ్చి నోణికి నెత్తొంచి అచ్చెనగిల్లలాడెనాడె! పీటల మీద గూసుండి పుస్తెగట్టిచ్చుకునెటందుకు ఇప్పటోళ్లేం కసురు గాయలు, పసరు విందెలు గారు. ఈడేర్ని వయిసు, మంచి చెడ్డలు ఏర్పాటు జేసె తెలివిడి గొల్పెసదువు, ఇట్ల, అగూ, బిగు, దక్కనంక మనుసు వడ్డోణ్ణే మరిపిచ్చుడు అల్కన గాదు' మంచిదిగుడ గాదు.

మీకుదెల్వంది యాండది నొష్టన ఎంతుంటె అంత ! బ్రహ్మరాత, తూడ్సుడు ఎవరితరం ? మీరు మరోతీరున అనుకోకుండి ఎట్ల రానే వొస్తిరి, సాయిత్యం దీస్క పోండి, అంట సంభావనిచ్చి సాగనంపిన,

అయ్య గారట్ల కడ్ప దాటిండొ లేదొ, మీ బావ మళ్లా నన్ను విల్సుకోని ఉయ్యాల మంచం మీదగూసుండి ఎక్కడ లేని వుల్లాసం తోటి కోడెపాయం నాటి కొంటె సూపు జూసి ముసి ముసి నగులొలుకంగ మనప్రభ- ప్రసాదుల ముచ్చెటంత పూసగుచ్చిండు. నన్ను ప్రాణవార్తి కంగ దగ్గరికి దీస్కోని సూడు! మీ ప్రభ ఎంపిక జేసుకున్న పిల్లగాడేం ఏరిపారేసె నాసిరకపోడు గాడు, అందరోలె ఉత్తసూపుడు గుర్రం తీరు గాదు, మంచి గోర్జెం, వున్న పుట్టుకె, సదువులల్ల అవ్వల్ నెంబరంట, పిల్లగాణ్కి నిల్వెత్తు గుమ్మరిస్తమంట ఆడి పిల్లలు గల్లోళ్లు బార్లు దీర్ని గని వొల్లనంటె వొల్లనని, ప్రభనె జేస్కుంట నన్నడంట, ఈ మొండిని ఆగలేక తలిదండ్రి గుడ జెరమెత్తవడి మంచిదినం జూసి నిచ్చితార్థం జేస్తం అన్న రంట. ఈకతంత జెప్పి శనాపెద్ద మనుస్సు తోటి మీ బావ, ''నిశ్చితార్థం జరిగెట్యాళ్లకు

నీవుగుడ అడుండుడు మంచిదిగద ! అంట తుర్తుల నన్ను దోల్తె వొచ్చిన,''ఇదినాకు దెల్సిన కత ! నీ కతేందొసెప్పరాదు ? నిప్పుకలు సెరుగకుండ'' అని అంటున్న అక్క మాటల తోటి వో సింతాకంత వొక్క దెచ్చుకోని తనకు తామసం ముంచుకొచ్చిన కతంత 'కాశిపట్నం' జూపినట్ల జెప్పవట్టింది. యశోదమ్మ.

అక్కా ! పిలగాణోళ్లు పిల్లం జూడవొస్తుండరని నాల్గు దినాలకు ముందె కార టందింది. అయ్యో ! ఇంట్ల సంబురం పొంగి కొండదాకింది. ఆ నాల్గు దినాలు ఇల్లంత కుచ్చుల కోలాటమేసినట్లె; అల్కులు, పూతలు, కడ్గడు, గాలిచ్చుడు, పలారాలు, ఎచ్చాలు, పూలు, తబుకులు, ఆకులు, పోకలు, ఊదుబత్తీలు కుడుకలు, పసుపు కుంకుమలు, గందాలు, అత్తర్లు పన్నీర్లు, అన్నిలాంచినం దప్పకుండ అమిరిచ్చి, తబుకుల మీద జాలి దీర్చి పూసలు గూర్చిన దస్తీలు గప్పి పెట్టిన్రు.

ఊతదంగం అంత జూస్తె నిశ్చితార్ధం జెయ్యొచ్చినోళ్లతీర్గ గాకుండ యాదో ? పెద్ద గురువులయ్య శిష్యవొర్గం తోటి సమసీగ్నం జేయవొస్తె బయభక్తుల తోటి చేస్తున్న సర్వ రాయి తీర్గనె కండ్ల వడ్డది.

ఇంటి పెద్ద నాయినమ్మ శేషమ్మ కండ్లకు సురచ్చి నాలు వెట్టుకోని ప్రభను విల్సి గదువ పట్టుకోని 'సూడు బిడ్డ ! మాఇంట్ల నీవు ఎత్తెత్తు మాణిక్యం తీర్గ వెర్గినవ్, రేపు మీ అత్తోళ్లొచ్చెట్యాల్లకు ఎంటికెలు సెంచితోలె ఇరవోసుకోకు, ముద్దుగ నేను మెరుగు వెడ్త, అటెంక బిగ్గజడేసుకో; నడిస్తె ఎదలిర్సి పక్కడు పక్కడు వుంట పాపోసులు సప్పుడు చేసుకుంట సోజరోడు నడ్సినట్ల నడ్వకు, వో గడిసేపు వాళ్ల ముంగల నెత్తొంచు కోని కూసుండు, ఏందన్న అడ్గితె సేరుకు సవసేరంట జవాబియ్యకు, జర సిగ్గు వడుకుంట పెండ్లికొడుకు దిక్కు వోరగండ్ల జూసి అప్పుడే నెత్తివొంచుకోని వీణె మీటి నట్ల సన్న కుత్తికె తోటి ముక్తసరిగ మాట్లాడు' అంట చెప్పి'నాచంద్ర దీపం' అంట మెట్కలు ఇర్సి ముద్దిచ్చుకుంటుంటె పిల్ల కిచ్కికిచ్కి మంట నగవట్టింది. అది జూసి మేమే గాదు, అదిక్కు కెళ్లివోతున్న అన్నయ్య గుడ వొచ్చె నగును రెప్పల్ల ఆగవట్టుకుంట ముందలికి నడ్సిండు. ఆడివిల్ల ద్రౌపదమ్మ సనువుగ వొచ్చి'అమ్మా ! మాంధాతల నాటి ముచ్చెట్లు, ఎన్నెల తార్లసొంటి ఈ కాలపు మనువరాళ్లకు జొస్తె ఎట్లనె ? రేపు నీ మనువడొస్తె సూస్కుమురుస్వ '' అంట జెప్పి మంచి గందాన్ని పరిమళిచ్చింది.

ఇంతట్లకె వొచ్చిరొచ్చిరంట కడ్పులల్ల కావలున్న పోరగాండ్లు ఉరుక్కొచ్చిన్రు.

నోట్లెమాట నోట్లె వుండంగనె పోవల్సి నోళ్ల బుజాన సెల్లలు సవరిచ్చుకోని పెద్దర్వాజ కాడనిలవడ్డరు. వొచ్చినోళ్లు మొత్తం తొమ్మిదివంది, ముగ్గురాడోళ్లు, ముగ్గురు మొగోళ్లు, వోసన్న పిల్ల, వోదుడ్డెగాడు, వోపనిపిల్ల, పెండ్లికొడుక్కు ప్రసాదురాలేదు ఏందో ? పనుండిందంట.

బంకులు దాటంగనె ఆడోళ్లంత బుజబుజమంటవోయి, ఇట్లకెళ్లి రాండమ్మ ! బాయి మీది గచ్చులల్ల మొకాలుగిన కడుక్కుందురు గని అంట తోల్కపోయి నీళ్లందిచ్చి, తుడ్సు కోను బట్ట తువాలందిస్తె వొచ్చినోండ్లు ఒగరి మొకాలొగరు అదో తీరు జూసుకున్రి, ఇంతట్లకె, పనిపోరి' మాచిన్నమ్మ గోరు 'టెర్కిటేవల్' వాడ్తారండి అంట, అన్నది గని మేం ఇనిపిచ్చు కోకుండ ఇంట్లకు నడ్సినం.

అందరొచ్చి మనుసాల్ల పెద్దబల్లె పీట మీద గూసుండిరి. దాని ఎదూర్గవున్న అరాం కుర్సీలల్ల పిల్ల గాణి తండ్రి, పిల్లతండ్రి గూసుంటె, సిన్నపోరలంత ఇంగో బల్లెపీటమీద గూసున్నరు. ఒగళ్లు అందియ్యంగ ఇంగోళ్లు వొంటింట్లకెళ్లి పలారాలు వట్టు కొస్తుంటె, పెద్ద తరహ్ గాపిల్ల మ్యానత్తొచ్చి కలెగల్పుగ నగు మొకం బెట్టి 'ఏఁమ్మ ! పయినం బాగసాగింది గద ? ఎండ పొద్దులు, తిప్పలు వెట్టలేదు గద ! అంట మర్యాదనడిపింది.

ఆ మాటకు పిల్లగాణి తల్లి 'ఆఁ సాగిందిలెండి ప్యాన్లు తిరక్క ఉక్కపోసి ప్రాణాలు తోడేశాయి అని అంటుంటే బిడ్డ బీబి పాత్మమ్మ శముత్కారంగ వన్నెలు వడుకుంట 'మమ్మీ ! వాడి తస్సాదియ్య, వాడేంటి? వద్దు మొర్రో అన్నా వినకండా చాయ్, చాయ్, అంటూ అస్తమానం కేకేసి చంపేశాడు బేవారిస్‌గాడు అన్నది. ఇద్దరొంతాయె, ఇంగ తను మాట్లాడకుంటె బాగుండదనుకున్నదో? ఏందొ మూడో తల్లి, కండ్లన్ని దిప్పుకుంట, అక్కగారూ, ట్రైనంత ఎంత రద్దీగ ఉందో, ఈస్ట్ గొదావరి నించి హైదరాబాదు వెళ్లడవంటె ఎంత దూరం? ట్రైన్‌లో హాయిగా షికారెళ్లినట్లు ఎళ్లిరావచ్చునుకుంటె ఎదుట బెర్తు వాళ్లు తెలుగు ను కూని చేస్తూ మాట్లాడ్తూ నానా కంగాళీ చేశారు. ఆతుర్క తెలుగు వినలేకపోయాం, వాళ్లతో కలిసి పెట్టెలో కూర్చోవటమే నావుర్దగ అనిపించింది. ఏదో ఇలా అవస్థ ల్తోటి బయటు ఎడి చివరికి మీ వూరొచ్చాం, అన్నది.

ఇట్ల నర్కుతున్న గొప్పలు, గప్పాలు సాలవన్నట్లు మళ్ల ఆ పిల్ల అందుకోని 'మమ్మీ ! శాటర్‌డే ప్రయాణంలో రష్ ఎక్కువ, 'మండే 'అయితే ఈజీగా,

బేజారీ లేకుండా కులాసాగా వెళ్చొచ్చు అంటే నామాటను, డాడి కేర్ చేస్తేగా ? అంట అంటుండంగనె

గల్లుగల్లున పాంజేవులు మోగంగ పూసిన తంగేడో లెపస్పు సీరగట్టి, మెరుపుతీగో లె ముత్తైద ఎంటరాంగ పలారపు కిస్తీవట్టుకోని వొయ్యారంగ నడ్సుకుంట సత్తెభామ తీర్గ వొచ్చింది ప్రభ. అపిల్లను జూసి వోరెప్ప పాటు అందరి కండ్లు ఇప్పారంగ జూసి బీరు వోయినట్లైంద్రు. పిలగాణి తండ్రి మట్కు మనుసార మెచ్చుకున్నడు.

ప్రభను జూసిన కాణ్నుండి ఓర్వలేని కువ్వారపు ఆడివిల్ల మసి మసి వడ్తుండది. ఈ సవందం గిన గట్టైగైతె కొ్రమట్టోలె నీల్గె తన నీల్గుడు సాగదనుకున్నదో ఏందో? పోకడ పెద్దమ్మ, ముక్కిర్పులు. మూతిర్పులు మొదలైనవి.

ఇంతట్లకె నాయనమ్మ ''ఏందుర్ల అట్ల నిలవడి సూస్తుండరు? గోడకు గొట్టిన ఎన్నముద్దలోలె ? సుట్టాలకు యాళ్లపాళ్లనర ? ముత్తైదలకు కుంకుమ పస్పులొంచుండి'' అనంగనె అందురం మంగళద్రవ్యాలు అమరిచ్చిన కిస్తీలు వట్టు కోని కొంగులు బుజాలిడు వకుండ జెక్కి. వొంగి వొంగి, నగుమొకాల్తోటి, వర్సలు గల్పుకుంట కుడికాలు జాపమ్మ పస్పులు వెట్టుకుందువుగని అంటె 'వద్దు లెత్తు' అంట పుల్ల ఇర్సినట్ల జేసిన్రు. ఇంగ కుంకుమగుడ తామె సేతికి దీస్కొని అంటి అంటనట్ల వెట్టుకున్నట్టు జేసి సోకు సెడ్తదని దస్తీలకు రాసుకున్నరు. ఇదంత జూసి నా పెయ్యంత సుర్రున మండింది, మేం జూపిన మన్ననంత ఆశట్కారి సూపుకు పల్లెదనపు మోటు వాసన గొట్టిందంట, వీళ్లషాన్ మిడ్క గని, ఏంజూస్క ఎలితివడ్డరొ?

ఆపెండ్లిగాని ఆడివిల్ల పట్నంల పుట్నంగింజోలెవుండి నదురు బెదురు లేకుండ నడ్సి నగని తాకుడు వడని పిల్లంట వొస్కె వట్టొచ్చుగని, ఇదేం ఏశం ? ఆమ్యాన గోడలమ్మ ? యాబాస సక్కగ రాదు, మాట్లాడ్తున్న బొట్లేరు కూతలన్ని అంగ్రిజ్ అను కుంటుండంది, మా అమ్మలకు వొచ్చినంత గుడరాదుగని, ఏందో హిమాకత్ !

యాదొ ! ఆచారాలు, ఇష్టం గాలేదు వొద్దన్నరు, ఇంతకు మనుసెందుకు సిన్నవు చ్చుకోవాల్నంట మట్టసంగనెవుంటి మాయె, ఇంతట్లకె ఆపిల్లది ప్రభను జూస్కుంట, 'ప్రభా ! మీ ఇంట్లో అన్ని బార్ బరస్ కంట్రీ హాబిట్స్; ఫోక్‌టేల్సులో లా, పోలేరమ్మల్లా పస్పులు పట్టించు కోవటాలు, కుంకుమలు వొంచుకోవటాలు, గందాలు రుద్దుకోవటా లేంటి ? ఇంత చదువుకున్న నీవు మాడరన్ సొసైటీ, హైక్లాస్ బిహేవియర్ తెలియని దాని

లావుండడం బాగోదు; ఏవంటావ్? అదే మా ఆంటీని చూడు ఎంత ఫాస్ట్ యాండ్ ఫార్ వర్డు థింకింగొ ? అంట దాని కళంత గుమ్మరిచ్చుకున్నది.

ఈ మాటలిన్న ప్రభమ్మకు రౌద్రం ముంచుకొచ్చిందిగని, అనువుగాని సోటు తన ప్రసాదు లేడు, అందికె కోపం నోటెంట బయలు వర్చకుండ చెంపలకు కెంపులద్దింది. చముత్కారంగ ఎడ్డినగు రూపుకంల అంత దిగమింగింది. ఇది జూసి ఫార్ వోర్డు ఆంటమ్మ ఉల్లాసం వుండ వట్టలేక- వాళ్ల ఆడివిల్లకు జెప్పినట్ల జేసుకుంట -

''బేబి ! మనం రాత్రంత ట్రైన్‌లో స్లీపింగ్ లేకుండా సిట్టింగ్‌లోనే వుంటూ ట్రావెలింగ్ చేసి, ఆ బ్యాడ్ ల్యాంగివేజి విన్నందుకే ట్రబుల్ ఫీలింగ్ అయ్యాం కదా, తీరా వియ్యమంటూ వొచ్చిన ఈప్లేస్‌లో, ఈ ఇంట్లో అంతా యాస, మరీ పాతకాలం మోటు, మనకల్చర్ వీరికి ఎప్పుడొస్తుంది ? ఎలావొస్తుంది. ఏవైనా ఈ సంబంధం నా మూషీగానే ఉంటుంది. అంట తెగిచ్చి కూసింది.

ఆమాటవిన్న ప్రభమ్మ చెవుల వెట్టిన కెంపులలోలాకులు కండ్లల్ల ప్రతి ఫలిచ్చంగ గిరుక్కున దిర్గి ఇంట్లకు నడ్సింది. అందాక ఎవ్వరికి ఏం జరిగింది దెల్వలేదు, పిలగాణి తల్లికి గుడ ప్రాణం చింతకాయ గొర్కినట్లైంది, ఆడోండ్లల్ల యింత కుంపటి రాజు కుంటున్న ఎంగతి దెల్వక, అవుతల దివాన్ కాండ్లకు శేషమ్మ వోయి కొడ్కును విల్సి 'ఏం నాయిన ! అందరికి అన్నిపసందయినట్లెగద ? అంతమెప్పిత మైనంక ఆల్సెం జేసు డెందుకు ? ఎల్లుండి నిశ్చితార్థానికి తయారు జేస్త అన్నది.

ఆ మాటిని పిలగాణి తండ్రి కడుపులేం కుటిలం లేకుండ, 'రేపు ఎలాను అబ్బాయి వచ్చేస్తాడు. మా వైపునుండి ఏ ఆటంకం వుండదు, అయితే రెండురోజులు మమ్మల్ని ఇక్కడే మకాం చేయమంటారు? అఁ అంటూ నే పెండ్లాన్ని విల్సుకున్నడు. ఆదొరు సాని, బిడ్డ ఆడింది ఉట పాడింది పాటోలె నెత్తి వూపుకుంట అంజనేలకు బదులుకోతిని జేసింది ఆ పిల్లను, అందుకే బిడ్డ మనుసు పోంటి పోదల్శి మొగణ్ణే జూసి, 'అదేటండి అంత తొందర ? అబ్బాయి వచ్చాక మనం కలిసి సంప్రదించుకోనక్కర్లా, ఆ మీదే ఏ నిర్ణమైనాను, వూరెళ్లాక మళ్లా తెలుపు దావుని చెప్పండి'' అంట పుల్ల ఇర్సింది.

గోపాలయ్య సంగతి జెప్తనంట లోపటికి పోయెట్యాళ్లకు ప్రభ మొకవంత జేవురిచ్చు కోని బాపూ ! ఈ సవందం నాకొద్దన్నది. ఆ మాటిన్న గోపాలయ్య నిల్వు

రాయి వడ్డడు. అందరి మొకాలు కత్తేటుకు నెత్తుటి సుక్క-రాల నంత తెల్లవడ్డవి. ఎవ్వరికి నోటెంట మాట పెకుల లేదు.

అయినగని అందరు గంబీరంగ మర్యాదలకు యాడ ఎలితి రాకుండ వడ్డున జేసి బోజినాలకు లేపిన్రు. వాళ్లగుడ వాళ్ల నడవడికను సరిదిద్దుకున్నట్ల సంబాళిచ్చు కోని బోజి నాల మీద గూసుండి వంటకాలు శనాకమ్మగ కుదిర్నవంట పొగిడిన్రు. తొల్త ఏందో దూది పింజలు ఊదితె గాలిల లేస్తయి, ఆడిచ్చి సూతమంట, రువాబు జూపిన్రు, గని, వాళ్లనుకు న్నట్ల తాలుయిత్తులు గాకుండ గట్టి గింజలంట తేలంగనె, వుబ్బుడంత వోయి సాపుగైన్రు. ఏం లాబం ? ఇనుమా? కట్టెన? ఇర్గితె అత్కో-టందుకు ? మనుసాయె; అందికె అన్నరు పెద్దలు దేన్నైన తెగ గుంజకు మంట.

ఎట్లైతేంది 'వెళ్లొస్తం అంట చెప్పిన్రు ' ప్రభకాన్రాలేదు, పెదువుల బిగికి ఇంటోళ్లంత మళ్ల దరువాజదాంక వోయి 'పోయిరాండి' అంట సాగనంపిన్రు. పిల్ల తల్లి పని పిల్ల సేతుల వో అయిదు రూపాల నోటు వెట్టింది. అదేమొ మొకం శాటంత గాంగ ''అమ్మగోరు మీరు మా మంచోరండి, ప్రభ గారు సినిమా యాక్టర్లా వున్నారండి'' అంటవలికి పైసక రామత్ సూపింది.

వాళ్లు వోయినంక, అది సుకమో ? దుక్కమె ? రొండెర్గని తీర్గ మాట పల్కు-లే కుండ బీడువడి కూసునోళ్లను జూసి శేషమ్మ సంగతి దెల్వక''అదేంది ? పిల్లలు ? బెల్లం గొట్టిన రాళ్లోలె మెస్లకుండ గూసున్నరు ? ఏంది అంటుంటె, ప్రభ తల్లి పెద్దమనిషికి చెప్పొద్దంట సైగ జేసి ''ఆఁ ఏం లేదు ఉడుకు-ల వుడుకు- అంట ఇప్పుడే గాక, మళ్లావో వారం పది దినాలకు ఇంత రాజానకం నడ్వాల్నంటె ? ఎట్లని ఆలోచన్ల వడ్డరు . అంట సర్ది చెప్పింది. అటెంక పెద్ద మనిషినాకాడి కొచ్చి 'పిల్లా ! ఏశోద, పెండ్లోండ్లు మాట్లాడి న మాట మన తెలుగేనా ? అదో తీరు యాసతోటి బాసోలె గండ్లవడ్తది.? వాళ్లను పయినం ఎట్లైందమ్మ అంట అడ్గితె ఏందో,

'రద్ది, బేవారీస్ గాడు, కంగాళి, అంటరేందె ? రైలు డబ్బుల రద్దినిండిందంటనా?, పాపం వీండ్లు మర్చి పోయి మాల్ గాడిలగట్ల ఎక్కి-న్రో ? ఏందో ? లేకపోతె మనరైళ్లనె సా మాన్ల డబ్బులగిన ఎక్కి-ండొచ్చు, శుబ్రంగ లేక సెత్త చెదారం, కసువు, కచ్ర, పనికిరాని రద్ది అంత నిండిన్నదేమొ నె ? అందికె పాపం తిప్పలు వడ్డరు. ఈ త్యాప బాగచూస్కో-ని ఎక్క-మనాలె.

ఇంగోటి, ఎవడో రైళ్ల బేవారస్ గాడు నిద్రవోనియ్యకుండ చా,చా, అంట వొర్లిండని సీదరిచ్చుకున్నోడు వాళ్ల ఊరోడో ఏందో ? బేవారిస్ గన్క-దిక్క లేక రైళ్ల చా అమ్ముక బతుక్కుంట వీళ్లను జూసి ప్రాణం లేసి రాంగ వద్దన్న ఇనకుండ చా, శాయ్, అంట అర్సిండొచ్చు ప్రాణవార్తికంగ తను వూరోల్లంట.

అవును ఏశోద! రైళ్లల్ల అవుసురానికి ఈవలీవల్కి పోను ప్రతేకం వో అరవుంటది గద, మళ్ల వీండ్ల ఎదురు మంచెమీద వున్నోళ్ల కంగాళి అదే 'కంగాల్' ఎట్ల జేసిరో ? ఏం కతలమ్మ, ఇనసిత్రాలు !

అవును పిల్లా , షికారు అంటె యాట వూర్గం గద ? వొలలు, బల్లాలు, ఈటెలు, సువ్వలు, తుపాకులు, దీస్కోని అడువులకు వోతరు గని రైళ్లషికారేంజేస్తరు ? షికారు చేస్త జీవరాసి యాండది? రైళ్ల, కొట్టేది నల్లినా ? బల్లినా?

ఈ త్యాప వొస్తె వాళ్ల మ్యానగోడలకి చెప్పాలె అనుకుంటుండ, వోయమ్మో ! తనకు నా మర్దగి అంట ? ఇదేం అన్యాలం? ఆడిపుట్టుక వుట్టి, 'నా మర్దిగి ' అంటె మొగ తనానికి లోటు, అంత పొడుగు, ఇంత పొడుగంట పెద్దిర్కం బల్కి అర్థం లేని పొల్లు మాటేంది ? మన మొగోళ్ల సెవులల్ల యాడవడ్డదో? అంట బుగులైంది. ఆతల్లి తప్పుడు తుర్కమె గాదు, ఇంగిలీసు గుడ ఇష్ట మొచ్చినట్ల సంది బందాలూడదీసి పోకళ్ల సూపు తుండది. ఏటివతలోళ్లు మందిని తుర్కం, గిర్కం అంట ఎక్కిరిస్తరు గని, వాళ్ల నోరు దెరిస్తె మాట్లాడేది ఆ బాసే, అదన్న తెల్సీ తెల్వని బాస. బాస బిస దిప్పుతనంటె కుదుర్తాది. నాల్గు బాసలు దెల్సినోళ్ల నిండు కుండలోలె వుంటరు, ఎగిసిపడరు, తప్పు లు అంత దైర్నంగ వల్కుతుంటె ఏందెల్వని గుడ్డి ముసలమ్మను, నాకె సెవులుతూట్లు వడ్డట్లనిపిచ్చింది.

యాదో ? సుట్టిర్కం గలిసినంక కడుపుల వెట్టుకోని పోవాలెగద, ఈత్యాప వొచ్చినప్పుడు, వాలాయించి ఇవి జెప్పు బిడ్డ, మనోళ్ల నలుగుట్ల నగువాట్లపాలు గాగూడదన్నది.

శేషమ్మపెద్దమ్మ మాటలిని అంత నొప్పిల గుడ నవ్వు ఆగలేదు, మబ్బులిడ్సిన మొగులోలె అందరి మొకాలు జళ జళైనయి. పెద్దామె బుద్ధికి మొక్కాలనిపిచ్చింది. సేదు మందు తేనె తోటి తాగిచ్చి పత్తెం గుర్తు దెల్వకుండ వెట్టింది.

ముసలమ్మ గుండె బలం దెల్సుకున్నంక ఉన్న వాస్తవం జెప్పుదమని, మెల్లగ అమ్మా! ఇగ జూడు, ఏటవతలోళ్లకు మనం మోటోళ్లమైనం, మనమాట యాస, మన రీతి రివాజులు, కట్టు బొట్టు, నడువడికం అంత యాసంట, మనం కాలంపోంటి నడ్వ కుండ బాయిల వడ్డ కప్పలోలె, తండ్లాడు కుంట 'యాండవె గొంగడి అంటె ఏసినకాణ్ణె' అన్నట్లు వుండమంట, వాళ్ల తీర్గ బూమికిమొగులకు అంటకుండ యాళ్లాడ్తలేమంట, వాళ్ల తీర్గ నజాకులు, నాజాకతులు దెల్వని మనసొంటి అనాగరిక పోళ్లసవందం వర్దన్నట్లే మాట్లాడిన్రు. ఆశలు ఇడ్సుకొ అంట జెప్పి నేను ఇంటికి కొచ్చిన.

అక్కా! ఇప్పుడు జెప్పు నేను పెంక మీది ప్యాలెంగింజోలెఎగుర కుంటె ఏంజేతు ? నేనుగాదు నీవేంజేస్తవొచెప్పు ? అన్నది.

అమాటలిన్న గోయిందమ్మ, సీర, బొట్టు సవరిచ్చుకోని 'చెల్లమ్మ పద పోదాం మనోండ్ల ఇంటి దాంక అంటె ఇద్దరు గల్సిపోయిన్రు.

అట్లవోయినోళ్లు ఆమాట ఈ మాట మాట్లాడుకుంటుండంగనే మోటరు సైకిలెక్కి జెయ్యివమంట ప్రసాదు, ప్రభ ఇద్దరొచ్చిన్రు. వాళ్లను జూడంగనె ఇదేం మైస్కరం ? ఇదేంఇంద్రజాలం ? మేం జూస్తున్నది నిజంగనేన, ఏదన్న కనికట్టు విద్దెనా ? అంట జూస్తుంటె సిన్న పిల్లలు, నాయినమ్మ, నాయిన ఇంగ రాండి సూతురంట కూతలు వెట్టిన్రు. ఇంట్లకెళ్లి వొచ్చిన తల్లి కొడుకు లిద్దరు ఎదురుంగ పూలదండ లేస్కోని పార్వతీ పరిమేశ్వరులోలె, నిలవడ్డ ప్రభ ప్రసాదులను జూసి తలుపులు దెరువం గనె ఎంకటేశ్వరస్వామి దర్శనం తోటి కండ్లు చెక్కిన మెరువంగ పైయంత పులుకలు వుట్టంగ ఏభావమో తెల్వకుండ కండ్లనీళ్లు గారంగ ఇదేం చిత్రం తల్లీ! అంటుండంగనె ఇద్దరొచ్చి గోపాలయ్య జానకమ్మలకు దండం బెట్టిన్రు, ప్రభ దబ్బున వోయి నాయనమ్మ సంకన సంటి విల్లోలె జొర్రింది. శేషమ్మ పిల్ల నెత్తి లేవట్టి ముద్దిచ్చుకుంట, అమ్మో! ఎంతదానవెంతైతివె ? పోయిపోయి ఆర్సమైన ఏన్గెనె ఎంటవెట్టు కొస్తివి అంట దబ్బున ఇంట్లకు వోయి మూడు ముద్దల అన్నం నల్పు, పస్పు, ఎర్పులు అద్ది తెచ్చి దిష్టి లేకుండ మత్తిదీసింది.

తల్లి జానకమ్మ 'ఏంనాయిన పెండ్లికి మేం మోటునుకున్నారా ? అంట, గొంతు గద్గద మనంగ కండ్లొత్తుకున్నది.

ఆమాట తోటి దెబ్బదిన్నట్లైన అల్లుడు లేదమ్మ ! మా చెల్లెలు తెల్వంది, పాపం మా అమ్మకేం దెల్వదు, ఏదో జరిగివుంటది, అందికే మీ రెండు కుటుంబాల అంటు సొంటు లేకుండ, ఎవ్వరి మనుసులు నొవ్వకుండ పెండ్లి జేసు కున్నం, ఇప్పుడు మీరెంత పండుగన్న జేసుకోండి,

అవ్వా ! మేం గుమ్మడి పండ్లను గని మీ చేతుల వెడ్తం, తెలంగాణపు పల్కుబడి తీపి నంత చేదుకొచ్చి నీవొళ్ల వోసి తరతరాలకు ఈ తీపి చెవులూరించాలని దీవిచ్చు, అన్నడు, అందరి ఎదలు సల్లగ గాంగ ఇండ్లకు నడ్సిన్రు.